కథానిక:

# కలిసిరాని కాలం

చావలి
వెంకటశాస్త్రి

నెల తిరగంగానే జీతం తెచ్చి పడేశాను. ఒక రోజున నా భార్య వచ్చి 'అయ్యో నా రాత, యిట్లాంటి రూపాయి తెచ్చారేం! ఎందుకన్నా పనికొస్తుందా' అంది.

అంతటితో వూరుకోలేదు. ఆ రూపాయి తెచ్చి నాకు చూపించింది. 'ఇదే గనక ఏ మా తమ్ముడో అయినట్లయితే యింక దెప్పేవారే ఓ నెల అన్నా సెలవు పెట్టి" అంది.

సాధారణంగా ఒకళ్ళను మోసం చేయటమే తప్ప నేను మోసగింపబడనని పేరు పడ్డాను కాబట్టి యీ సంఘటన జరిగేటప్పటికి కొంచెం అవమానం జరిగినట్లుగా ఫీలయినాను. అదీగాక ప్రతినెలా నా భార్య చెప్తూనే వుంటుంది జీతాలు తెచ్చుకునే రోజుల్లో జాగ్రత్త అని.

ఆ రూపాయి చూశాను. పైకి బాగానే వుంది. కాని మోగిస్తే ఆ శబ్దాన్ని నేను చెప్పలేను. అంత తమాషా శబ్దం వస్తుంది.

'దీనికేం నిక్షేపంలాగా వుంది. రేపీపాటికి మార్చనా' అన్నాను. సాధారణంగా త్వరలో మారదని తెల్సు. కాని ఆ మాత్రం అన్నా ఆసరాగా మాట్లాడంది అవతలి మనిషి నోరు ఆగదు.

తను పనిచేసే వాళ్లకూ, ఎలక్ట్రిక్ బిల్లుకూ, చాకలి వాళ్లకూ — ఎంతోమందికి యిచ్చి చూసిందట. అందరూ పెదవులు విరిచి 'ఈసారి యిట్లాంటిది కాకుండా యింకో రకంది యివ్వండి' అన్నారట.

నా భార్యకు చాలా కష్టం వేసిందట. ఇట్లాంటి రూపాయిని మార్చాలనిచూసేదానికన్నా నామర్దా అయిన పని మరోటి లేదని విసుక్కుంది.

'అయ్యో పాపం. అంత నామర్దాపని ఎందుకూ?'

ఆనాటినుంచే దానిని మార్చటానికి ప్రయత్నం చేయటం మొదలు పెట్టాను. తెలిసిన కిళ్ళీకొట్లల్లో వేసి చూశాను. వాళ్ళు 'పంతులుగారూ మాతో నా పరిహాసాలూ. మా తెలివితక్కువ తనం ఆఖరికి యిట్లాంటి రూపాయిలుకూడా తీసుకోటం దాకా పోలేదు' అన్నారు.

కొంచెం కష్టం వేసింది. నాకు నేనే వెన్ను చరుచుకున్నాను.

సినిమాల దగ్గరా, లాటరీ దగ్గరా, ఎగ్జిబిషన్లలో షాపులలో—ఒక చోటేమిటి ఎన్నోచోట్ల ఎన్నో విధాల ప్రయత్నం చేశాను. చదువుకున్న నాబోటి గాడికి కిల్లాంటి బుద్ధి మంచిది కాదనీ, ఇట్లా మార్చబోవటం రూపాయికోసం నీచానికి పాల్పడటమే ననీ—యిల్లాంటి రకమైన మాటలు అనటం మొదలు పెట్టారు. చాలా చోట్ల తల వంచాల్సి వచ్చింది.

ప్రయత్నం చేసినచోటనే ఇంకోసారి ప్రయత్నం చేసేసరికి, ఆ రూపాయిని కత్తిరిస్తా నన్నాడు. ప్రాణం చివుక్కుమంది. స్వయంగా విషం పెట్టి బిడ్డను చేతులారా చంపినట్లయింది.

దీం దుంపతెగా! ఈ రూపాయికోసమని దగ్గర దగ్గర పది రూపాయిలదాకా ఖర్చుపడ్డాను. దాన్ని మార్చాలనే మిషతో ఏదో వస్తువు కొనటం, ఆ రూపాయి యివ్వటం, అది చెల్లకపోవటం! మరో రూపాయి యివ్వటం. ఇల్లా ఓ పది రోజుల దాకా అవస్తపడ్డాను.

నాకు బయట ఎంతగా అవమానం జరిగినా ఏమీ అన్పించలేదుగాని యింటికి రాంగానే ప్రతి రోజూ నా భార్య అడిగేది చెల్లిందా అని. దానికీ కొన్నాళ్లయిం తర్వాత విసుగుపుట్టి 'ఆ, అదుగో చెల్లని రూపాయి మొహం' అని ఎవరిమీదనో పెట్టి అనేది.

ఆఫీసులో తోటివాళ్ళు నా వుద్యమం కనిపెట్టి రోజూ ఫలితం అడిగేవారు. నాకు కష్టం వేసేది. ఆఖరికి వారఫలాలు కూడా చూట్టం మొదలు పెట్టాను. చెల్లని రూపాయలు యీ వారంలో చెల్లుతయ్యని ఒక పత్రికా చెప్పలేదు.

ఎక్కడ రూపాయిని చూసినా నా రూపాయే గుర్తొచ్చేది. అది ఎప్పుడూ నా కంట్లో ఆడ్తుండేది. ఆఫీసులో పని చేస్తానన్న మాటేగాని ఆ రూపాయి ఎట్లా చెల్లిద్దామా అనే యోచన!

నేను ఫోంచేసి ఆఫీసుకు బయలేరుతుంటే నా భార్య అనేది 'ఆ రూపాయి కోటు జేబులో పెట్టుకున్నారుగా' అని నవ్వుతూ. ఏం చేస్తాం మరి! కలిసిరాని కాలంలో పావలాకుకూడా చిల్లర దొరకదు.

నాకు కలలోకూడా యివేగా సంగతులు! హఠాత్తుగా ఒక రోజున కలలో బ్యాంకులో పని చేస్తున్న ఒకడు నాకు ఎంతో మేలుచేసి నాకు విజయాన్ని చేకూర్చినట్లుగా అయింది. ఆరోజు తెల్లారక ముందే లేచాను. ఎంతో వుత్సాహంగా వున్నాను. నా పని పాకాన పడినట్లుగానే భావించాను.

వాడి దగ్గరి కెళ్లి నా యాతన అంతా చెప్పు కున్నాను. పూస గుచ్చినట్లుగా అంత శ్రమా వివరించాను. వాడు నవ్వి 'యింత శ్రమ ఎందుకూ, మాట మాత్రం అంటే నే పనిచెయ్యక పోయి నానా!' అన్నాడు. ప్రాణం లేచి వచ్చింది. వాడి కిచ్చాను. వారం రోజుల్లో చూస్తా నన్నాడు. అంతగా కావాలంటే తనే తీసుకుని యింకో రూపాయి యిస్తా నన్నాడు. లోపల కావాలను కున్నా వద్దన్నాను మర్యాద కోసం.

కాని వాడు వొప్పుకో లేదు. అది తీసుకొని తన పర్సులోంచి యింకో రూపాయి యిచ్చాడు. నిజంగా స్నేహితం స్నేహితమే! వాడు నా అభిమానాన్ని కాపాడాడు.

ఆ రాత్రి యింట్లో చెప్పాను. నా భార్య ఆశ్చర్య పోయింది. దానికి నేను తెచ్చిన రూపాయి చూపించిం దాకా నమ్మకం కలగలేదు. చూసి ఒకటే నవ్వటం మొదలుపెట్టింది. నా కర్థంగా లేదు.

ఈ రూపాయి మోగించింది నేను వినాల్నని. నవ్వూ కోపమూ వచ్చినై! ఈ రూపాయి జన్మ జన్మాలకయినా మారదు. అట్లాంటి మోత నే నెన్నడూ విన్లేదు. ఇన్నాళ్ళనుంచీ నా దగ్గరున్న రూపాయ మెరుగన్పించింది.

నా స్నేహితుడు ఓమాటు కన్పించాడు. ఆ రూపాయి మార్చినట్లుగా చెప్పాడు.

జరిగిం దానికన్నా నా స్నేహితుడు చేసిన అవమానం మరీ ఎక్కువయింది. ఎవరితో నన్నా చెప్పుకోటానికి నామోషి!

మళ్లా ఈ రూపాయి మార్చటాని కిమ్మడీ అన్నా ఖర్చుపెట్ట దల్చుకోలేదు.




తళతళలాడే కండ్లు....

అవి ఆరోగ్యానికి లక్షణాలు. మీ ఆరోగ్యాన్ని అందాన్ని కాపాడుకొనేందుకు ఉత్తమ ఆరోగ్య పోషక రసాయనం శాంతి అశోక సేవించండి. దా..లోని రసాయన వస్తువులకు తో డు అనేక శతాబ్దాలనుంచి స్త్రీ వ్యాధులకు ఉత్తమ ఔషధమని ప్రశిద్ధికెక్కిన దేశీయ ఓషధి అశోక చేరి వున్నది.

శాంతి అశోక

ఉత్తమ గర్భాశయ రోగనివారిణి

శాంతి కుటీరం

తణుకు — పశ్చిమ గోదావరిజిల్లా.

సోల్ ఏజంట్లు:— శ్రీ కృష్ణా జనరల్ స్టోర్సు, తణుకు

మద్రాసు స్టాకిస్టులు:

యస్. విశ్వనాధం కంపెని, 44 బందరువీధి, మదరాసు